సాక్షి
గుంటూరు
శనివారం। 22। ఫిబ్రవరి। 2025



మాతృభాషా దినోత్సవం

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో శుక్ర వారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 534.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 8,452 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కనక దుర్గమ్మకు ధాన్యాభిషేకం

పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీనగర్‌లో వేంచేసియున్న కనకదుర్గమ్మ దేవస్థానంలో శుక్ర వారం ధాన్యాభిషేకం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గెలుపు కోసం కుతంత్రం

- ప్రభుత్వంపై ఉద్యోగులు, నిరుద్యోగుల్లో వ్యతిరేకత
- నీటిమూటగా మెగా డీఎస్సీ హామీ
- నిరుద్యోగులకు భృతి హామీ హుళక్కి
- ఉద్యోగులకిచ్చిన హామీలను తుంగలో తొక్కిన వైనం
- కూటమి పార్టీల్లో విభేదాలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లడిగేందుకు జంకుతున్న ఎమ్మెల్యేలు
- మంత్రి గొట్టిపాటికి బాధ్యతల అప్పగింత

కూటమికి పట్టభద్ర ఎమ్మెల్సీ గండం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఈనెల 27న జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పచ్చ పార్టీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రారంభంలో ఎన్నిక ఏకప క్షమని ధీమాగా చెప్పినా, చివరకు వచ్చేసరికి పరిస్థితి భిన్నంగా కనపడుతోంది. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గట్టిపోటీ ఇస్తూ చెమటలు పట్టిస్తున్నారు. ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యో గులలో ఉన్న వ్యతిరేకతకు తోడు కూటమి పార్టీల్లోని అసంతృప్తులతో పీడీఎఫ్ అభ్యర్థికి కలి సివచ్చే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇదే విషయాన్ని నిఘా విభాగం ప్రభుత్వానికి చేరవేసింది. దీంతో బెంబేలెత్తిన ముఖ్యమంత్రి చంద్రబాబు, చినబాబు అప్రమత్త మయ్యారు.

రంగంలోకి రాబిన్‌సింగ్

గడచిన సార్వత్రిక ఎన్నికల్లో పని చేసిన రాబిన్‌సిం గ్ టీంను రంగంలోకి దించారు. పరిస్థితి ఇబ్బం దికరంగా ఉందని, బెదింపులు, ప్రలోభాల పర్వా నికి తెరతీయకపోతే సీటు గల్లంతేనని ఆయన నివేదించినట్లు తెలుస్తోంది. దీంతో చినబాబు లోకేష్ సీన్‌లోకి వచ్చారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారథికి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. తేడా జరిగితే పరువు మొత్తం గంగలో కలుస్తుందని చెప్పినట్లు తెలుస్తోంది. ఆలపాటి విజయానికి పనిచేయకపోతే ఎమ్మెల్యేల స్థానంలో అధిష్టానం ఇన్‌చార్జ్‌లను నియమిస్తుందని మంత్రి గొట్టిపాటి ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు ప్రచారం ఉంది.

మంత్రి ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం

చినబాబు ఉత్తర్వులు అందుకున్న మంత్రి గొట్టిపాటి, ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారథి రేపల్లె, వేమూరు, బాపట్ల నేతలతోపాటు ఉమ్మడి గుం టూరు నేతలతోనూ సమావేశమయ్యారు. ముఖ్య మంత్రి, చిన్న మంత్రి సందేశాన్ని ఎమ్మె ల్యేల చెవిన వేశారు. అయితే ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగులతోపాటు సొంత పార్టీ కేడర్‌లోనూ వ్యతిరేకత ఉందని, వారిని పని చేయమంటే వినే పరిస్థితి లేదని పలువురు ఎమ్మెల్యేలు మంత్రుల దృష్టికి తెచ్చినట్లు సమాచారం. పదవులు ఇవ్వక పోవడంతోపాటు అధికారంలో సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆగ్రహంతో ఉన్న జనసేన, బీజేపీ నేతలు సైతం సహకరించే పరిస్థితి లేదని కొం దరు నేతలు వివరించినట్లు తెలుస్తోంది. ఓటర్లకు ఎంత రేటు పెడితే వర్కవుట్ అవుతుందన్న దాని పైనా చర్చ జరిగింది. వెయ్యి రూపాయలు సరిపో తుందని కొందరు, కాదు రూ. 2 వేలు అంతకన్నా ఎక్కువ ఇవ్వాల్సిందేనని మరికొందరు ఎమ్మె ల్యేలు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎందుకు?

తొమ్మిది నెలల కూటమి పాలనపై అన్నివ ర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన వందకు పైగా హామీలను నెరవేర్చక సర్కార్ వంచించింది. చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెర వేర్చక ప్రజలను వంచించారు. పైగా విద్యుత్, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు, ఊరూరా బెల్టుషాపుల ఏర్పాటు, వలం టీర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు కక్షగట్టి చిరుద్యోగులను తొలగిం చారు. సచివాలయ ఉద్యోగులను గాలిలో దీపంలా ఉంచారు. మెగా డీఎస్సీ పేరుచెప్పి హడావుడి చేసినా ఇంతవరకూ అతీగతీ లేదు. నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న హామీ నీటి మూటే అయింది. దీంతో చదు వుకున్న యువత కూటమి సర్కార్ తీరుపై మరింత ఆగ్రహంతో ఉంది. పట్టభద్రుల ఎన్నికల్లో ఇది పీడీఎఫ్ కు కలిసి రానుందని అంచనా.

పచ్చ పార్టీలో ఇంటిపోరు

పచ్చపార్టీలో ఎమ్మెల్యేలు మొదలు కేడర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలపై వ్యతిరేకత కనపడుతోంది. అధికారం రాగానే ఎమ్మెల్యేలు అక్రమార్జనే ధ్యేయంగా వ్యాపారానికి తెరలేపారు. కనపడ్డ స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని పేదల కడుపుకొట్టి నెలవారీ అమ్ముకుంటు న్నారు. పార్టీ విజయం కోసం పనిచేసిన ముఖ్యనే తలు, క్రియాశీలక కార్యక ర్తలకు పైసా రాబడిలేదు. నామినేటెడ్ పదవులు వస్తాయని ఆశించిన వారికి అవి దక్కలేదు. కష్ట పడి తాము పనిచేస్తే ఎమ్మెల్యేలు, ఎంపీలు అధి కారాన్ని అనుభవిస్తున్నారని పచ్చనేతల్లో తీవ్ర ఆగ్రహం ఉంది. ఇది ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభావం చూపించే అవకాశమున్నట్లు పరిశీల కుల అంచనా.



ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఉమ్మడి కృష్ణా గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి ప్రశాంతంగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మైక్రో అబ్జర్వర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ సమర్థంగా నిర్వహించాలని ఆదేశిం చారు. మైక్రో అబ్జర్వర్ల విధులను పవర్‌పా యింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణలో భాగంగా బ్యాలెట్ బాక్సుల పరిశీలన గురించి వివరించారు. సమావేశంలో ఎన్నికల జనరల్ అబ్జర్వర్ వి.కరుణ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులకు సూచనలు

అనంతరం కలెక్టర్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి విధుల గురించి అవగాహన కల్పించారు.

26న మల్లయ్య గట్టుకు లాంచీలు

విజయపురి సౌత్: మహా శివరాత్రిని పురస్కరిం చుకుని ఈ నెల 26వ తేదీన మాచర్ల మండలం అనుపు నుంచి ఏలేశ్వరస్వామి ఆలయానికి (మల్లయ్య గట్టుకు) ఏపీ టూరిజం ఆధ్వర్యం లో ప్రత్యేక లాంచీలను నడపనున్నట్లు లాంచీ యూనిట్ మేనేజర్ వినయతుల్లా తెలిపారు. శుక్రవారం విజయపురి సౌత్‌లోని లాంచీ స్టేష న్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుపు నుంచి ఆ రోజు ఉదయం 7 - మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఈ సర్వీ సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. టికెట్ ధరను పెద్దలకు రూ.200, ఐదేళ్లు దాటిన పిల్ల లకు రూ.150గా నిర్ణయించామన్నారు.

న్యూస్‌రీల్

తిరుపతమ్మకు బంగారు నెక్లెస్ బహూకరణ



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారికి శుక్ర వారం తెనాలికి చెందిన లంక శ్రీనివాసరావు, రత్నజ్యోతి దంపతులు 20 గ్రాముల బంగారు నెక్లెస్, 135 గ్రాముల వెండి గిన్నెను ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికా రులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

జీజీహెచ్‌లో 'మీకోసం మేము'



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌కు వచ్చే రోగుల సమస్యలను తెలుసుకుని తక్ష ణమే వారి సమస్యలు పరిష్కరించేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ 'మీకోసం మేము' నూతన కార్య క్రమాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభిం చారు. డాక్టర్లు, రోగుల మధ్య సమన్వయం ఏర్పాటు చేసి త్వరితగతిన రోగులకు చికిత్స అందించేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు రోగుల బంధువు లతో సూపరింటెండెంట్, సంబంధిత వైద్యులు మాట్లాడి రోగులు, వారి బంధువుల సమస్యలు తెలుసుకుని తగు చర్యలు తీసుకుం టారన్నారు. రోగులు ఆస్పత్రిలో పాటించవల సిన నియమ నిబంధనలు, వారి బంధువులు పాటించవలసిన నియమాలు వివరించారు. ఆస్పత్రిని శుభ్రంగా ఉంచేందుకు పాటించవల సిన పద్ధతులు తదితరవాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు, రోగి బంధువులు పాల్గొ న్నారు. కార్యక్రమంలో భాగంగా తొలి రోజు రోగుల సమస్యలను సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ నేరుగా తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు.

1,14,723 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,01,695 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,14,723 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూప ర్-10 రకాల సగటు ధర రూ.9,600 నుంచి రూ.14,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమ యానికి యార్డులో ఇంకా 54,685 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

ఘనంగా శోభాయాత్ర



మాచర్ల: పట్టణంలో శుక్రవారం గాయత్రి మహాయజ్ఞం కనులపండువగా నిర్వహిం చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 500 మంది శోభాయాత్రలో పాల్గొన్నారు. తొలుత కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశాక కలశాలతో ముందుకు సాగారు. లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి వెళ్లి గాయత్రీ మహా యజ్ఞంలో పాల్గొన్నారు. భారీగా దీప యజ్ఞం నిర్వహించారు. అఖిల విశ్వ గాయత్రీ పరివార్ శాంతికుంజ్ హరిద్వార్, మాచర్ల శాఖ వారి ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటైంది. సీఐ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అన్నదాతకు

'విశిష్ట గుర్తింపు'

- ఆధార్ తరహాలో రైతులకు భూ ఆధార్
- 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ
- రిజిస్ట్రేషన్ అయితేనే ప్రభుత్వ పథకాలు

కొరిటెపాడు(గుంటూరు): ఆధార్ తరహాలో రైతులకు భూ ఆధార్ కార్డులను అధికారులు జారీ చేస్తున్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట చేపడుతున్న ఈ ప్రక్రియలో ప్రత్యేక యాప్‌లో సొంత భూమి కలిగిన ప్రతి రైతు వివరాలు నమోదు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ అవు తుంది. ఇలా రిజిస్ట్రేషన్ అయితేనే కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అందించే వ్యవసాయ పథకాలు, రాయితీలు, సాగు యంత్రాలు, వ్యవసాయ పరికరాలు అందిస్తారు. ఈ నేపథ్యంలో రైతుల నమోదు ప్రక్రి యను అధికారులు వేగవంతం చేశారు. అన్నదాతలు కూడా రిజిస్ట్రేషన్‌కు రైతు సేవా కేంద్రాలకు క్యూ కడు తున్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 1.30 లక్షల మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకు 70,478 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

నమోదు ఇలా..

రైతులంతా భూ వివరాలు కలిగిన పట్టాదారు పాసుపుస్తకం, 1-బీ అడంగల్, ఆధార్ కార్డు జిరా క్స్‌లతో పాటు ఆధార్ కార్డుకు లింక్ చేసిన ఫోన్ నంబర్‌ను గ్రామంలోని సచివాలయానికి అను బంధంగా ఉన్న రైతు సేవా కేంద్రానికి తీసుకుని వెళ్లాలి. ఆర్‌ఎస్‌కేలోని గ్రామ వ్యవసాయ సహా యకులు(వీఏఏ) సంబంధిత పోర్టల్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తారు. ఈ క్రమంలో మన ఫోన్ నంబ ర్‌కు వచ్చే మూడు ఓటీపీలు చెప్పాల్సి ఉంటుంది. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ విజయవంతమైనట్లు ఫోన్‌కు సందేశం వస్తుంది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఇలా నమోదు చేసుకుం టే ప్రభుత్వ పథకాలు పక్కాగా వర్తిస్తాయి. ఇక నుంచి తమకు ఈ పథకం రాలేదు.. ఆ పథకం రాలేదు.. పీఎం కిసాన్ డబ్బులు అందలేదన్న ఫిర్యాదులు రైతుల నుంచి ఉండవని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఇలా భద్రపరచాలి..

నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతులకు జారీ చేసిన విశిష్ట గుర్తింపు సంఖ్యను ఫోన్‌లో కానీ, పట్టాదారు పాసుపుస్తకంపై కానీ రాసుకుని భద్రపరుచుకోవాలి. వీలైతే ఈ సంఖ్యను గుర్తించు కుంటే చాలా వరకు మంచిది. ఒకవేళ గుర్తింపు సంఖ్య మర్చిపోయినా, పోయినా మళ్లీ రైతు సేవా కేంద్రానికి వెళ్లి, రైతు తమ భూ వివరాలు ఇచ్చి తెలుసుకోవచ్చు.



మేడికొండూరు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

రైతులకు ప్రయోజనకరం



ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా రైతులకు జారీ చేస్తున్న విశిష్ట గుర్తింపు సంఖ్య ఎంతో ప్రయోజనకరం. ఆధార్ నంబర్ బట్టి మన వివరాలు ఏ విధంగా వస్తాయో అలాగే రైతుల 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారా రైతు, ఆయన చేస్తున్న పంటల సాగు వివరాలు, ఆయన పొందుతున్న వ్యవసాయ పథకాలు అన్నీ తెలుస్తాయి. ఏ పథకానికి రైతు అర్హుడో కూడా తెలుస్తుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్‌ఎస్‌కేల్లో నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటి వరకు 70,478 మంది రైతులు నమోదు చేయించుకున్నారు.

–నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు జిల్లా

ఇంటర్ దూరవిద్య పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (దూరవిద్య) ఆధ్వర్యంలో మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్.అక్బర్ అలీ, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలి పారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బం దీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఇం టర్మీడియెట్ దూరవిద్య పరీక్షల చీఫ్ సూపరింటెండెం ట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులను శుక్రవారం డీఈఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ, ఆయా తేదీలలో ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వ హించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అరగంట ముం దుగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాలలో 2,117 మంది పరీక్షకు హాజ రుకానున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న పల్నాడు డీఈఓ చంద్రకళ

బుర్రకథా నాయకుడు నాజర్

- ప్రాచీన కళకు కొత్త హంగులద్దిన కళాకారుడు
- సంగీతంలోనూ ప్రజ్ఞాశాలి
- కళల తెనాలితో ప్రత్యేక అనుబంధం
- నేడు షేక్ నాజర్ వర్ధంతి



తెనాలి: షేక్ నాజర్ వలి.. ప్రాచీన జానపద కళా రూపం బుర్రకథకు కొత్త జీవం పోసిన ఘనులు. ప్రత్యేక హావభావాలు, ఆహార్యంతో ప్రదర్శనలిచ్చి అఖిలాంధ్రను షేక్ చేసిన కళాకారులు. 'ఈ గండ పెండేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీ లూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటి కాదు' అని సగర్వంగా ఎలుగెత్తి చాటిన గొప్ప ప్రతిభా ధీశాలి. సంగీతం, నటన, సాహిత్యం, గాన కళల్లోనూ తనదైన ముద్రవేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి.

పొన్నెకల్లులో జననం

నాజర్ 1920 ఫిబ్రవరి 5న జిల్లాలోని పొన్నెకల్లు గ్రామంలోని ఓ పేద ముస్లిం కుటుంబంలో జన్మిం చారు. ఆయన తండ్రి మస్తాన్ చెక్కభజనలో నేర్పరి. పెదతండ్రి నాజరు షహనాయి విద్వాం సుడు. ఆ వాతావరణంలో పుట్టి పెరిగిన నాజర్‌కు సంగీతంపై ఆసక్తి ఏర్పడింది. ఏడేళ్ల వయసులో పాఠశాల వార్షికోత్సవంలో ప్రదర్శించిన నాటకం నాజరు కళాజీవితానికి అంకురార్పణ చేసింది. పొన్నెకల్లులో 'కనకతార' నాటకంలో నాజర్ గానా నికి ముగ్దులైన ప్రముఖ హార్మోనిస్టు ఖాదర్ ఆయనను ప్రోత్సహించారు. తన వెంట తెనాలికి తీసుకొచ్చి బాలల నాటక సమాజం 'బాలరత్న సభ'లో చేర్పించారు. నాజర్ మంచి ప్రతిభ కనబర చడంతో నరసరావుపేట తీసుకెళ్లి అక్కడ ఓ సంగీత గురువు దగ్గర చేర్పించారు. ఆ తర్వాత నాజర్‌పై తండ్రి మరణంతో కుటుంబ భారం పడింది. వ్యవ సాయ పనులకు వెళ్లారు. వారసత్వంగా ఉన్న గుడిలో సన్నాయి మేళం వాయించేవారు. కుట్టుమిషను నేర్చుకుని దుస్తులు కుట్టారు. ఏది చేసినా పాటను మాత్రం ఆపలేదు. ఒక రైతు కోరిక మేరకు అతడి పిల్లలకు సంగీతం చెప్పారు. ప్రముఖ సంగీత దర్శకుడు చక్రవర్తి ఆ విధంగా నాజర్ దగ్గర సంగీత పాఠాలు నేర్చుకున్నారు.

సినీ రంగంలోనూ ప్రవేశం

1948లో కమ్యూనిస్టు పార్టీ నిషేధంతో నాజర్ నాట కాల్లో కొనసాగారు. సినిమాల్లోకి రాకముందు జమునకు శిక్షణనిచ్చి నాటకం వేయించారు. ఆ తర్వాత నాజర్‌ను సినీరంగం ఆహ్వానించింది. 'పుట్టిల్లు', 'అగ్గిరాముడు' సినిమాల్లో బుర్రకథలు చెప్పారు. 'భలే బావ', 'నిలువుదోపిడీ', 'పెత్తం దార్లు' చిత్రాలకు పనిచేశారు. కొంతకాలం విప్లవ రచయితల సంఘం (విరసం)లో ఉన్నారు. 1986లో భారత ప్రభుత్వం పద్మశ్రీతో గౌరవించిం ది. కేంద్ర సంగీత నాటక అకాడమీ విశిష్ట సభ్యత్వ మిచ్చింది. ఇక గండపెండేరాలు, సువర్ణ ఘంటా కంకణాలు, ఎల్లలు లేని సన్మానాలూ, ఊరేగింపు లూ తెలుగు నేలంతా కోకొల్లలుగా అందుకున్నారు. నాజర్ ఆత్మకథ 'పింజారీ' పేరుతో వెలువడింది. 1997 ఫిబ్రవరి 22న అంగలూరులో ఆయన కన్ను మూశారు.

ప్రజానాట్యమండలి ద్వారా బుర్రకథా గానం



నాజర్‌లోని కళా ప్రతిభను గుర్తిం చిన కమ్యూనిస్టు నాయకుడు వేము లపల్లి శ్రీకృష్ణ గుం టూరులోని కమ్యూనిస్టు పార్టీ ఆఫీసుకు తీసుకెళ్లి బుర్రకథ నేర్పిం చారు. ప్రజల నుంచి ఆదరణ రావటంతో నాజర్ గుంటూరు జిల్లా ప్రజానాట్య మండలిని స్థాపించి విస్తృతంగా బుర్రకథలు చెప్పసా గారు. పాటలు, బుర్రకథలు స్వయంగా రాశారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేశారు. బుర్రకథలో నాజర్ గుప్పిం చిన విషాదానికి రంగస్థల మహానటుడు బళ్లారి రాఘవ కన్నీరు పెట్టుకున్నారు. చెన్నైలో వీరి ప్రదర్శన చూసిన గోవిందరాజుల సుబ్బారావు, 'ఇది గుంటూరు గోంగూర దెబ్బ' అంటూ అభినందించారు. ప్రముఖ పాత్రికేయుడు కేఏ అబ్బాస్ 'ఆంధ్ర అమరోషే క్'గా నాజర్‌ను అభివర్ణించారు. నాజర్ ప్రతిభకు పుచ్చలపల్లి సుందరయ్య, ప్రముఖ సినీనటి భానుమతి కూడా ముగ్దులయ్యారు.

వ్యాఘ్ర వాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని గంగా భ్రమ రాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం నాలుగో రోజు స్వామివారు వ్యాఘ్ర వాహనంపై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామిని దర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవ కైంకర్యకర్తలుగా మంగళగిరి పట్టణానికి చెందిన సిందే నారాయణ రావు వ్యవహరించారు. ఆలయంలో భక్తులకు దాతలు పొంగలి ప్రసాదం పంపిణీచేశారు. దేవ స్థాన ఈవో జేవీ నారాయణ ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు.



వ్యాఘ్ర వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న మల్లేశ్వరుడు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 5,000 గరిష్ఠం : రూ. 5,900

మోడల్ ధర రూ. 5500

క్లుప్తంగా

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్



గుంటూరు రూరల్: ప్రకృతి సేద్యానికి రైతులను ప్రోత్సహించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ప్రైవేట్ హాలులో రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ, ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజులపాటు ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై రాష్ట్ర స్థాయి శిక్షణ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి సేద్య ఆవశ్యకతను వివరించారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) గురించి వివరించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి బి.రామారావు, అధికారులు చక్రవర్తి, గోపిచంద్, ప్రవీణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు (మోడల్ స్కూల్స్) 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శుక్రవారం తెలిపారు. జిల్లా పరిధిలోని 14 ఆదర్శ పాఠశాలల్లో ఏప్రిల్ 20 వ తేదీన ఉదయం 10 – మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్షను ఆయా మండలాలలోని ఆదర్శ పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

వైభవంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

తెనాలి: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. పట్టణానికి చెందిన కవి, రచయిత పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, స్వరలయ సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు తమ ప్రసంగాల్లో మాతృభాషా దినోత్సవం ప్రారంభం, విశిష్టత, ఆవశ్యకతను తెలియజేశారు. గాలి సత్యనారాయణ, పావులూరి శ్రీనివాసరావు, వేములపల్లి సుజన, పినపాటి రవికుమార్, నండూరి నారాయణరావు, యడవల్లి శ్రీనివాసచౌదరి, జల్లి గంటయ్యలు మాతృభాషా దినోత్సవం వైశిష్ట్యాన్ని వివరించారు. విశిష్ట అతిథులు పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, సాయి లక్కరాజులు మాతృభాష ప్రచారానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి బేతాళ ప్రసాద్ చేతులమీదుగా సత్కరించారు. కోశాధికారి హృదయరాజు పర్యవేక్షించారు.



పెన్షనర్స్ అసోసియేషన్‌లో సాయి లక్కరాజుకు సత్కారం

లూథరన్ ప్రాథమికోన్నత పాఠశాలలో...

అంతర్జాతీయ మాతభాష దినోత్సవాన్ని స్థానిక నాజర్‌పేటలోని లూథరన్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మునిపల్లి వెంకట రఘునాథరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కవి, రచయిత, కళాకారుడు లక్కరాజు లక్ష్మణరావు మాట్లాడుతూ మాతృభాష మాధుర్యాన్ని, భాషా వశ్యతకను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.ప్రియదర్శిని, ఉపాధ్యాయుడు ఎం.వెంకటరెడ్డి ప్రసంగించారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వేమన శతక పద్యాల పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. తొలుత తెలుగుతల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

మాతృభాషను మరవద్దు

చేబ్రోలు: మాతృభాషని ఎవరూ కూడా మరచిపోవద్దని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య చెప్పారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. లావు రత్తయ్య మాట్లాడుతూ మాతృభాష విశిష్టతను వివరించారు. మాతృభాష బాగా వస్తే ఇతర భాషల్లోనూ నైపుణ్యం పెంచుకోవడం సులువు అవుతుందని, బహుభాషా నైపుణ్యం ఉన్నవారికి గ్లోబల్ మార్కెట్‌లో మంచి అవకాశాలు ఉంటాయని వెల్లడించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, మెమెంటోలను అందజేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ లావు రత్తయ్య

ఓటు హక్కు అవగాహన ర్యాలీ

తెనాలి: కృష్ణ–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 27న జరగనున్న నేపథ్యంలో తెనాలిలో శుక్రవారం ఓటు హక్కు అవగాహన ర్యాలీని నిర్వహించారు. 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్య పరుస్తూ తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు.

తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారులు దుర్గాభాయ్, కె.సంజీవరావు, సిబ్బందితో కలిసి ప్రదర్శనగా బయలుదేరారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నుంచి కొత్తపేట, బోసురోడ్డు మీదుగా గాంధీచౌక్ వరకూ చేరుకున్నారు. అక్కడ మానవహారం నిర్వహించి ఓటు హక్కు వినియోగం గురించి ప్రతిజ్ఞ చేశారు. సబ్ కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తెనాలి అర్బన్, రూరల్ కలిసి 26 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని చెప్పారు. గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇక్కడ పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని, ఈ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ నిర్వహణ గురించి అధికారులు తెలియజేశారు. వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభించిన సబ్‌కలెక్టర్ సంజనా సింహ

రూ.46.60 లక్షల విలువైన 234 మొబైల్స్ రికవరీ

బాధితులకు అప్పగించిన పోలీసులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల వివరాల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితులకు అప్పగిస్తున్నట్లు జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి చెప్పారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సుమారు రూ.46.60 లక్షల విలువైన 234 మొబైల్ ఫోన్లను జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో శుక్రవారం బాధితులకు అప్పగించారు. ఏఎస్పీ మాట్లాడుతూ బాధితులు పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేయడం ఆనందంగా ఉందన్నారు. సెల్‌ఫోన్లు పోతే పోలీస్ హెల్ప్ లైన్ నంబర్ 8688831574 లేదా సీఈఐఆర్ వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి మాట్లాడితే ఆ నంబర్లను బ్లాక్ చేసి, దగ్గర్లోని పోలీస్‌స్టేషన్ లేదా జాతీయ సైబర్ భద్రత టోల్ ఫ్రీ నంబర్ 1930కు సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో సీఐలు నిషార్‌బాషా (ఐటీకోర్), నరేష్‌కుమార్ (పీసీఆర్), హెడ్ కానిస్టేబుళ్లు కిషోర్, రమేష్, కానిస్టేబుళ్లు శ్రీధర్, ఇమాంసాహెబ్, గౌస్‌భాషా, మానస, కరిముల్లాను ఏఎస్పీ అభినందించారు.



బాధితురాలికి మొబైల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఏఎస్పీ రమణకుమార్

ఐసీఏఐ గుంటూరు శాఖ కొత్త కార్యవర్గం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖకు (2025–26) సంవత్సరానికి చైర్మన్‌గా చింతా రఘునందన్, కార్యదర్శిగా వనిమిరెడ్డి వెంకట నరేష్ ఎన్నికయ్యారు. శుక్రవారం శ్రీనివాసరావుతోటలోని ఐసీఏఐ గుంటూరు శాఖ కార్యాలయంలో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. నూతన కమిటీ వైస్ చైర్మన్‌గా రుద్రవరపు భరద్వాజ్, కోశాధికారిగా మృత్యుంజయరావు, సికాస చైర్మన్‌గా రాజశేఖర్ నాగబీరు, సభ్యులుగా షేక్ బాజీ, దేసు సంపత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చింతా రఘునందన్ మాట్లాడుతూ ఐసీఏఐ గుంటూరుశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నూతన భవన నిర్మాణ పనులను పూర్తి చేసి, సీఏ సభ్యులకు, విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పిస్తామని తెలిపారు. ఆదాయపు పన్ను, జీఎస్టీ అధికారులతో పాటు అన్ని వర్తక సంఘాలను కలుపుకుని అవగాహన సదస్సులు నిర్వహించి, దేశ ఆర్థిక పురోగతిలో తమ వంతు పాత్ర పోషిస్తామని అన్నారు. ఎస్ఐఆర్‌సీ కార్యదర్శి ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు సీఏ విద్యపై అవగాహన పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.



చింతా రఘునందన్



వనిమిరెడ్డి వెంకట నరేష్

25న శివరాత్రి సమన్వయ కమిటీ సమావేశం

అమరావతి: పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీ మాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి శివరాత్రి బ్రహ్మోత్సవాల సమన్వయ కమిటీ మూడో సమావేశం ఈ నెల 25వ తేదీన జరగనుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్ కుమార్ ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంతరెడ్డి ఆధ్వర్యంలో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ప్రాంగణంలో సమావేశం ఉంటుందని చెప్పారు.

పండ్లతోటల పెంపకంపై రాయితీ

నరసరావుపేట రూరల్: పండ్లతోటల పెంపకంపై ప్రభుత్వ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డాట్ సెంటర్ శాస్త్రవేత్త నాగేష్ తెలిపారు. మండలంలోని పమిడిమర్రులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త నాగేష్, ఉద్యాన శాఖ అధికారి నవీన్‌కుమార్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం మిర్చి ధర తక్కువగా ఉన్నందున రైతులు నష్టపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంద శాతం రాయితీలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్‌లో ఉద్యాన పంటలకు ఇచ్చే రాయితీని వచ్చే 2025–26 నుంచి పెంచినట్టు తెలిపారు.

సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

దమ్మాలపాడు (ముప్పాళ్ళ): గ్రామాల్లో జరుగుతున్న ఎన్‌సీడీ–సీడీ సర్వేను వేగవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.రవి చెప్పారు. దమ్మాలపాడు గ్రామంలో ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని, ఎన్‌సీడీ- సీడీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా పంచాయతీ సిబ్బందితో పని చేయించాలన్నారు. రోడ్ల వెంబడి చెత్త లేకుండా చూడాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ–సీడీ సర్వేలో భాగంగా ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మార్చి 30వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్, సీహెచ్ఓ హర్షవర్ధన్, ఆరోగ్య పర్యవేక్షకుడు ఎ.పీటర్ డేమియన్, ఎస్‌కే రహిమాన్, ఏఎన్ఎం మస్తాన్‌బీ, ఆశా కార్యకర్తలు సుభాన్‌బీ, సుబ్బమ్మ, కుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

24న కలెక్టరేట్ ఎదుట ధర్నా

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునఃప్రారంభిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ముందు 24వ తేదీన ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ చెప్పారు. స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24వ తేదీ నాడు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాల వద్ద రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ధర్నాల్లో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, కార్పెంటర్ యూనియన్ నాయకులు కాయల రామారావు, బొట్టు శ్రీనివాసరావు, చల్లా మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ

వలస కూలీల మినీ లారీ బోల్తా

ఆరుగురికి గాయాలు

మేడికొండూరు: వలస కూలీలతో వెళుతున్న మినీ లారీ రోడ్డుపై బోల్తా కొట్టడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని సత్తెనపల్లి రోడ్డులో గుళ్ళపాలెం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడు గ్రామానికి చెందిన వలస కూలీలు 25 మంది గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కోవెలమూడి గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో మేడికొండూరు సమీపంలోని గుండ్లపాలెం పెట్రోల్ బంక్ వద్ద మినీలారీ అదుపు తప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఘటనలో లారీలో ఉన్న రాజ్ కుమార్, చంద్రమ్మలకు తీవ్ర గాయాలు అవ్వగా మరో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి 108 సహాయంతో తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.



బోల్తా కొట్టిన మినీ లారీ

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మేడికొండూరు: ఆటోను వ్యాన్ ఢీకొన్న ఘటనలో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పేరేచర్ల కాల్వ సమీపంలో జరిగింది. పేరేచర్ల నుంచి మేడికొండూరు వైపు వెళ్తున్న ఆటోను గుంటూరు నుంచి సత్తెనపల్లి వైపు వెళ్తున్న వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అడ్వాన్స్ తిరిగివ్వాలని కోరితే బెదిరింపులు

వ్యక్తిపై కేసు నమోదు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఇంటి కొనుగోలుకు ఇచ్చిన అడ్వాన్స్ తిరిగివ్వాలని అడిగినందుకు బెదిరింపులకు దిగిన ఓ వ్యక్తిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. వేళంగిణి నగర్ ప్రాంతానికి చెందిన కర్రా విజయరాణి, ఆమె భర్త తెనాలి రాజశేఖర్ గుంటూరు ముత్యాలరెడ్డినగర్‌లోని ఒక ఇల్లు కొనుగోలుకు నిర్ణయించారు. దీనికోసం చైతన్యపురి కాలనీకి చెందిన కురాకుల శ్రీనివాసరావు, శోభారాణిలకు అడ్వాన్స్‌గా రూ.20 లక్షలు చెల్లించారు. తీరా ఇల్లు పూర్తిగా పరిశీలించగా నచ్చకపోవడంతో ఇల్లు బాగోలేదని, అడ్వాన్స్ తిరిగివ్వాలని కోరారు. అయితే నగదు తిరిగివ్వకుండా శ్రీనివాసరావు, శోభారాణి మూడు నెలలుగా కాలయాపన చేస్తూ వచ్చారు. గురువారం శ్రీనివాసరావు, శోభారాణి ఇంటి వద్దకు వెళ్ళి డబ్బులు ఇవ్వాలని కోరగా బాధితురాలు విజయరాణిపై దుర్భాషలాడి, హత మారుస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో బాధితురాలు గురువారం రాత్రి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉడికించిన చికెన్, గుడ్లు తినవచ్చు

గుంటూరు మెడికల్: గుంటూరు నగరం పట్టాభిపురంలోని స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చికెన్, కోడిగుడ్ల వినియోగంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, మొహమ్మద్ నసీర్ అహ్మద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఉడికించిన చికెన్ గుడ్లను తినొచ్చన్నారు. ఉడికించిన వాటిని తినటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారం కారణంగా చికెన్, గుడ్లు వ్యాపారం దారుణంగా దెబ్బతిందని గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. మేళాలో చికెన్‌తో కూడిన భోజనం చేసేందుకు జనం ఎగబడ్డారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్ నిమ్మల శేషయ్య, స్టాండింగ్ కమిటీ మెంబర్ బాబు, ఎం.కిషోర్ బాబు, పౌల్ట్రీ ట్రేడర్ అసోసియేషన్ అమరావతి ప్రెసిడెంట్ సురేష్, పౌల్ట్రీ ఫెడరేషన్ చైర్మన్ అసోసియేషన్ నాగేశ్వరరావు, రేణుక పౌల్ట్రీ పరిశ్రమ గిరి పాల్గొన్నారు.

చికెన్ తినేందుకు ఎగబడిన జనం

గుంటూరు జిల్లా ఫార్మర్స్, ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చికెన్ అండ్ ఎగ్ మేళాలో విశేషస్పందన లభించింది. ప్రభుత్వం ఆధ్వర్యంలో బర్డ్ ఫ్లూపై ప్రజల్లో అనుమానాలు తొలగించి, అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన చికెన్ ప్రియులు తరలివచ్చారు.



పట్టాపురం స్వామి థియేటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన చికెన్, కోడిగుడ్లు మేళాకు హాజరైన ప్రజలు